# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-02-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రహదారి సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.**

3. **రాష్ట్ర శాసన సభ సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయని వెల్లడించిన ప్రభుత్వ చీఫ్ విప్ కాల్వ శ్రీనివాసులు.**

4. **ప్రపంచ పప్పుధాన్యాల దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.**

============================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి ఈరోజు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు, వివిధ ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అంశాలతో పాటు, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపై చర్చించారు. పోలవరం ప్రాజెక్టు రెండవ దశకి ఆర్థిక సహాయం అందించాలని... భూసేకరణ, పునరావాసం వంటి పనులు చేపట్టాల్సి ఉందన్నారు. వీటికి అదనంగా సుమారు 32,000 కోట్ల రూపాయల నిధులు అవసరం అని పేర్కొన్నారు. నదీ జలాల పంపకం కోసం గోదావరి నీటి వివాదాల ట్రిబ్యునల్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. జాతీయ నదుల అనుసంధాన విధానంలో భాగంగా పోలవరం--నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రమంత్రికి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

--------------------------

గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రహదారి సౌకర్యాన్ని కల్పిస్తున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా, యలమంచిలి మండలంలోని అడవి పాలెం, మేడపాడు గ్రామాల్లో 5 కోట్ల రూపాయలతో జరుగుతున్న రహదారి పనులను మంత్రి ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ, అడవి పాలెం నుంచి మేడపాడు వరకు 1600 మీటర్ల పొడవుతో సిమెంట్ రహదారి పనులు జరుగుతున్నాయని చెప్పారు. నిర్మాణ పనులకు అవసరమైన నిధులను మంజూరు చేశామని ఈ రహదారి ద్వారా ఆయా గ్రామాల ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం అందుబాటులోకి

వస్తుందని మంత్రి వివరించారు.

---------------------------

ప్రస్తుత సాంకేతిక యుగంలో  సురక్షితంగా ఉండడం ఎంత అవసరమో గుర్తు చేసే ఉద్దేశ్యంతో ఈరోజు సురక్షిత అంతర్జాల దినోత్సవం –SAFE INTERNET DAY నిర్వహిస్తున్నారు.  పిల్లలు , యువత, పెద్దలు ప్రతి ఒక్కరూ ఇంటర్నెట్ ను బాధ్యాయుతంగా, సురక్షితంగా, సానుకూల దృక్పదంతో నిర్వహించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. పతి ఏటా ఫిబ్రవరి నెల రెండవ మంగళవారం ఈ కార్యక్రమం జరుగుతోంది. ఇంటర్నెట్ ను సురక్షితంగా వినియోగించడం, పిల్లల కోసం తల్లిదండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తలు, సైబర్ నేరాలు జరిగితే స్పందించవలసిన పద్ధతులు వంటి అంశాలపై  ఈ రోజు  అవగాహన కల్పిస్తున్నారు.

---------------------------

ఇంటర్నెట్, కృత్రిమ మేధస్సు –AIను  సరైన పద్ధతుల్లో వినియోగించడం ద్వారా సత్ఫలితాలను  పొందవచ్చని నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ – ఎన్ఐసి విభాగం అనంతపురం జిల్లా  ఇన్ఫర్మాటిక్స్ అధికారి  భారతి తెలిపారు. సురక్షిత  ఇంటర్నెట్ దినోత్సవం సందర్భంగా అనంతపురంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్నెట్ వాడకంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ఈ రోజు పాల్గొన్నారు.  ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆన్‌లైన్ భద్రత, బాధ్యతాయుతమైన ఇంటర్నెట్ వినియోగం,  సైబర్ మోసాల గురించి అవగాహన కల్పించేదుకు సురక్షిత  ఇంటర్నెట్ దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు.

---------------------------

అనకాపల్లి జిల్లా సంతపల్లి గ్రామానికి చెందిన ఆదర్శ రైతు బొబ్బిలి జ్యోతి  ప్రకృతి వ్యవసాయంలో వినూత్న వ్యవసాయ పద్ధతుల అమలుకు గానూ ఐరోపా దేశాలతో పాటు మొత్తం 7 దేశాల్లో రైతులకు అవహగాన కల్పించేందుకు ఎంపికైయ్యారని వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారు పి. విజయ్ కుమార్ తెలిపారు. ఆమె అవలంబిస్తున్న  వ్యవసాయ పద్ధతులను, అనుభవాలను అంతర్జాతీయ స్థాయిలో తెలియజేసేందుకు  రైతు సాధికార సంస్థ ఎంపిక చేసిందని తెలిపారు. ఈ ఎంపికపై జ్యోతి మాట్లాడుతూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధ అమలుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ,  ఢిల్లీకి చెందిన ఏఐ సంస్థ  మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని వ్యవసాయ శాఖ సంచాలకులు మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో  సంబంధిత అధికారులు  ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారని ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో రైతు కేంద్రీకృత సేవల విస్తరణతోపాటు వ్యవసాయ విస్తరణను మరింత సమర్ధవంతంగా మార్చే దిశగా కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగించుకునేందుకు ఈ ఒప్పందం చేసుకున్నట్లు మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ముందస్తు అంచనా విశ్లేషణల ద్వారా పంటల తక్షణ స్థితి, పురుగులు, తెగుళ్లపై హెచ్చరికలు, సమాచారం  ఆధారంగా రైతులకు సలహాలు ఇచ్చేందుకు కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థ పని చేస్తుందని వివరించారు

---------------------------

రాష్ట్ర శాసన సభ సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయని ప్రభుత్వ చీఫ్ విప్ కాల్వ శ్రీనివాసులు వెల్లడించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆయన ఈరోజు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా సమావేశాలకు హాజరు కావాలని సూచించారు. సమావేశాల్లో ప్రజా సమస్యలను ప్రస్తావించాలని ఆయన పేర్కొంటూ....

..వాయిస్...32 సెకన్లు

---------------------------

ప్రపంచ పప్పుధాన్యాల దినోత్సవాన్ని ఈరోజు పాటిస్తున్నారు. మానవ ఆరోగ్యంలో పప్పుధాన్యాల ఆవశ్యకతను తెలియజేసేందుకు, వీటి వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 10వ తేదీన ప్రపంచ పప్పుధాన్యాల దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్యరాజ్య సమితికి అనుబంధంగా ఉన్న ఆహార, వ్యవసాయ సంస్థ 2018లో పిలుపునిచ్చింది. అప్పటినుంచి ఏటా ఫిబ్రవరి 10న 'ప్రపంచ పప్పుధాన్యాల దినోత్సవం'గా నిర్వహిస్తున్నారు.పప్పుధాన్యాలను రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల కలిగే బహుళ ఆరోగ్య ప్రయోజనాల గురించి ప్రజల్లో చైతన్యం కలిగించడంతోపాటు ఆహార భద్రత సాధనలో వీటి పాత్రను తెలియజేయడం ఈ రోజు నిర్వహణలోని ముఖ్య ఉద్దేశం.

---------------------------

శివరాత్రి సందర్భంగా కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి ప్రభల తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని నరసరావుపేట ఇంచార్జ్ డిఎస్పీ హనుమంతరావు తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేట లోని డిఎస్పీ కార్యాలయంలో కోటప్పకొండ ప్రభల నిర్వాహకులతో పోలీసులు ప్రత్యేక సమావేశాన్ని నిన్న నిర్వహించార. ఈ సందర్భంగా ఇంచార్జ్ డిఎస్పీ మాట్లాడుతూ,

వాయిస్ సెకన్లు

---------------------------

తిరుపతి జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రం శ్రీకాళహస్తి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను ఈరోజు నుంచి నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి బాపిరెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తిలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, 13 రోజుల పాటు వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నామని చెప్పారు. ఈరోజు సాయంత్రం ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని, రాత్రికి అంకురార్పణ జరుగుతుందన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. బ్రహ్మోత్సవాలు జరిగే 13 రోజుల పాటు ఆలయంలోని అన్ని ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నామని తెలిపారు.

---------------------------

ఆహారంలో కల్తీని, గడువు ముగిసిన ఆహార పదార్థాల విక్రయాలను అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలను నిర్వహించాలని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యులు జె . కృష్ణ కిరణ్ అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో ఆహార భద్రత ప్రమాణాల చట్టం అమలు విధివిధానాలపై అధికారులతో ఈ రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ కిరణ్ మాట్లాడుతూ, రేషన్ సరుకుల సరఫరా, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం, అంగన్వాడీ పోషకాహార పథకాలను సమర్ధవంతంగా అమలు చేయాలన్నారు. ఆహార భద్రత ప్రమాణాల చట్టం నిబంధనలను ఉల్లంఘించే

వారిపై  చర్యలు తీసుకోవాలని సూచించారు.

-----------------------------

వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధ వినియోగానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ, ఢిల్లీకి చెందిన ఏఐ సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని వ్యవసాయ శాఖ సంచాలకులు మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులు  ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారని ఒక ప్రకటనలో తెలిపారు.

=======================